క్లుప్తంగా

సిరులతల్లికి తులసిపూజ



తులసిపూజలో సిరులతల్లి

డాబాగార్డెన్స్: బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మి అమ్మవారి దేవస్థానంలో శనివారం తులసిపూజ నిర్వహించారు. ఉదయం 7 నుంచి 8 గంటల వరకు నిర్వహించిన ఈ పూజలో, అమ్మవారి త్రికాల పంచామృతాభిషేక సేవలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. ప్రతి శనివారం నిర్వహించే తులసి పూజలో పాల్గొనదలిచే భక్తులు రూ.1,500, త్రికాల పంచామృతాభిషేక సేవలో పాల్గొనే భక్తులు రూ.1,000 పూజా రుసుం చెల్లించి పాల్గొనవచ్చని ఆలయ ఈవో కె. శోభారాణి తెలిపారు. ఈ ప్రత్యేక పూజను పరోక్ష పద్ధతిలో చేసుకునే భక్తులు యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, టౌన్ కొత్తరోడ్డు శాఖ, అకౌంట్ నంబరు 060810011006691, ఐఎఫ్ఎస్‌సీ కోడ్ యూబీఐఎన్ 0806081లో చెల్లించవచ్చు. కార్యక్రమంలో ఆలయ ఈవో కె. శోభారాణి, ఏఈవో తిరుమలేశ్వరరావు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సమాచార సిబ్బంది ఆధ్వర్యంలో మజ్జిగ పంపిణీ



మజ్జిగ పంపిణీ చేస్తున్న జిల్లా సమాచార పౌర సంబంధాల శాఖాధికారి ఎస్.వి.రమణ

మహారాణిపేట: జిల్లా పరిషత్ సమీపంలో ఉన్న సమాచార పౌర సంబంధాల శాఖ కార్యాలయ పరిధిలో మజ్జిగ వితరణ కార్యక్రమం చేపట్టారు. రోడ్డుపై వచ్చీపోయే కార్మికులు, ఆటోవాలాలు, ప్రయాణికులకు కార్యాలయ అధికారులు, సిబ్బంది, జిల్లా సమాచార పౌర సంబంధాల అధికారి ఎస్.వి.రమణ మజ్జిగ పంపిణీ చేశారు. అనంతరం కార్యాలయ ఆవరణలో పరిశుభ్రత చర్యలు చేపట్టారు. జిల్లా సమాచార పౌర సంబంధాల అధికారి ఎస్.వి. రమణ, ఇతర అధికారులు మల్లికార్జున, నారాయణరావు, శ్రీనివాసరావు, కిశోర్ తదితరులు పాల్గొన్నారు.

అధిక రక్తపోటు ప్రాణాంతకం



జెండా ఊపి ర్యాలీని ప్రారంభిస్తున్న డాక్టర్ పూర్ణేంద్రబాబు

మహారాణిపేట: ప్రపంచ రక్తపోటు దినోత్సవం సందర్భంగా వైద్య ఆరోగ్యశాఖ ఉద్యోగులు శనివారం నగరంలో ర్యాలీ నిర్వహించారు. రేసవానిపాలెంలోని డీఎంహెచ్‌వో కార్యాలయం వద్ద మొదలైన ర్యాలీ సత్యం జంక్షన్ మీదుగా తిరిగి డీఎంహెచ్‌వో కార్యాలయం వరకు సాగింది. ఈ ర్యాలీని అదనపు జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ పూర్ణేంద్రబాబు జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధిక రక్తపోటుపై అందరికీ అవగాహన కల్పించాలన్నారు. దీని కోసం ప్రతి ఏడాది మే 17వ తేదీన ప్రత్యేక కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. రక్తపోటు సాధారణ స్థాయి కంటే పెరగడాన్నే హైపర్ టెన్షన్ అంటారని, ఇది సైలెంట్ కిల్లర్ వ్యాధి అన్నారు. ఇది గుండెపోటు, పక్షవాతం, కిడ్నీ సమస్యలు, చూపు కోల్పోవడం, మానసిక సమస్యలకు దారి తీస్తుందన్నారు. అధిక రక్తపోటు అదుపులో ఉంచుకోవడం చాలా అవసరం అన్నారు. రోజూ మందులు వాడుతూనే ఆహారంలోనూ కొన్ని జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. వాస్తవానికి రక్తపోటు అనేది రోగం కాదని, రోగ సంకేతమూ కాదని,. అదొక జీవ లక్షణమన్నారు. రక్తపోటు అనేది ప్రతి మనిషిలోనూ ఉంటుందని, కానీ ఉండాల్సిన దాని కంటే అధికంగా ఉంటేనే దాన్ని అధిక రక్తపోటు అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ హారిక, ఇతర ప్రోగ్రామ్ ఆఫీసర్లు, వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

అన్న ప్రసాదానికి విరాళం అందజేత

అక్కిరెడ్డిపాలెం: షీలానగర్ ఎస్టీబీఎల్‌లోని తిరుమల బాలాజీ దివ్యక్షేత్రంలో నిత్య శనివారం జరిగే అన్న ప్రసాదాలకు దాతలు విరివిగా విరాళాలు అందజేస్తున్నారు. శనివారం షీలానగర్‌కు చెందిన కె.జయవెంకటకృష్ణ, జ్యోత్స్న చిరంజీవి, లవిక దంపతులు రూ.10116 విరాళం ట్రస్ట్ ప్రతినిధులకు అందించారు.

భవన నిర్మాణ కార్మికులకు..
ఏదీ ఆసరా?

- సంక్షేమ పథకాలపై అవగాహన కల్పించడంలో అధికారులు విఫలం
- సభ్యత్వ నమోదులోనూ వెనుకబాటు
- ప్రభుత్వ సాయం పైనా అవగాహన లేమి

అల్లిపురం: భవన నిర్మాణ కార్మికుల భద్రత, సంక్షేమం కోసం ప్రభుత్వం 1998లో భవన నిర్మాణ కార్మిక సంక్షేమ పథకం ప్రవేశపెట్టింది. ప్రారంభంలో ఈ పథకం కేవలం భవన నిర్మాణ కార్మికులకు మాత్రమే ఉపయోగపడేది. అనంతరం అనేక రకాల పనులు చేసే కార్మికులు ఈ పథకంలో చేరడానికి అర్హులుగా ప్రభుత్వం ప్రకటించింది. ప్రస్తుతం భవన నిర్మాణ కార్మికులతో పాటు గ్రానైట్ కార్మికులు, ఉపాధి కూలీలు, టైలర్లు, ఎలక్ట్రీషియన్లు, కార్పెంటర్లు, మెకానిక్ పనులు చేసే కార్మికులు ఈ పథకంలో సభ్యత్వం తీసుకునేందుకు అర్హులు. కానీ భవన నిర్మాణ కార్మిక సంక్షేమ పథకంపై కార్మికులకు అవగాహన కల్పించడంలో అధికారులు విఫలమవుతున్నారు.

సభ్యత్వ నమోదు ఇలా..

చేతివృత్తుల కార్మికులు 18 నుంచి 60 ఏళ్ల మధ్య వయసు కలిగి ఉండాలి. దరఖాస్తు చేసుకునేందుకు రెండు ఫొటోలు, ఆధార్, రేషన్ కార్డు, బ్యాంకు అకౌంట్ పాస్ పుస్తకం జిరాక్స్ కాపీలతో పాటు కార్మికుడిపై ఆధారపడి జీవించే వారి ఆధార్ కార్డు జిరాక్స్ కాపీలు అందజేయాలి. రూ.120 చెల్లించి కార్మిక శాఖ కార్యాలయంలో సభ్యత్వం పొందవచ్చు. ఒక్కసారి సభ్యత్వం తీసుకున్న వారి లేబర్ కార్డు పరిమితి 5 ఏళ్ల వరకూ ఉంటుంది. ఆ తర్వాత సభ్యత్వాన్ని రెన్యువల్ చేసుకోవాలి.

నియోజకవర్గంలో..

నియోజకవర్గంలోని అల్లిపురం సింహాలదేవిడి, దొండపర్తి, సింగ్‌హోటల్ జంక్షన్, టౌన్ కొత్త రోడ్డు, దండుబజారు, రెల్లివీధి, ఏవీఎన్ కాలేజీ డౌన్, పంజా జంక్షన్ తదితర ప్రాంతాల్లో వేలాది మంది కార్మికులు భవన నిర్మాణ రంగంలో కార్పెంటర్లుగా, టైలర్లుగా, ఉపాధి కూలీలుగా, ఎలక్ట్రీషియన్లుగా పని చేస్తున్నారు. వీరికి అవగాహన కల్పించి సభ్యత్వం ఇప్పించాల్సిన బాధ్యత అధికారులపై ఉంది. కానీ ఈ పనిని వారు అంతంతమాత్రంగానే నిర్వహిస్తున్నారు. దీంతో అర్హులైన చాలా మంది కార్మికులు ప్రమాదాల బారిన పడి వారి కుటుంబాలు నష్టపోతున్నప్పటికీ ప్రభుత్వం నుంచి ఆర్థిక సహాయం పొందలేకపోతున్నారు. ఫలితంగా కార్మిక కుటుంబాలకు ఎంతో కొంత ముట్టజెప్పి యజమానులు చేతులు దులుపుకుంటున్నారు.



అల్లిపురంలోని సింహాలదేవిడి వద్ద పని కోసం వేచి ఉన్న భవన నిర్మాణ కార్మికులు (ఫైల్)

ప్రయోజనాలు..

కార్మికుడు పనిచేసే చోట ప్రమాదవశాత్తు మరణించినా, శాశ్వత అంగవైకల్యం పొందినా రూ.2 లక్షల ఆర్థిక సాయం వర్తిస్తుంది. 50 శాతం అంగ వైకల్యం పొందిన వారికి రూ.1 లక్ష, సాధారణ మరణం పొందితే రూ.30 వేలు అందిస్తారు. వివాహం తర్వాత కార్మికునికి ఒక్కో కుమార్తెకు కాన్పు సమయంలో రూ.25 వేలు చొప్పున రెండు కాన్పులకు ఆర్థిక సహాయం అందుతుంది. స్వల్ప మొత్తం చెల్లించి సభ్యత్వం పొందడం ద్వారా 5 ఏళ్ల పాటు కార్మికుడికి, ఆయన కుటుంబానికి భద్రత లభించడంతో పాటు సంక్షేమ పథకాలను కూడా పొందే సౌలభ్యం ఉంది.

పథకం గురించి చాలా మందికి తెలియదు



నియోజకవర్గంలో చాలా ప్రాంతాల్లో వేల మంది కార్మికులు పని కోసం వేచి ఉంటారు. పనులు చేసే సమయంలో ఎక్కడో ఒకచోట కార్మికులు గాయపడుతున్నారు. కొంత మంది శరీరంలోని కొన్ని అవయవాలను కోల్పోతున్నారు. మరి కొంత మంది చనిపోతున్నారు. అటువంటి వారికి కార్మిక శాఖ నుంచి ఎటువంటి సహాయ సహకారాలు అందుతాయన్న విషయం చాలా మందికి తెలియదు. కార్మిక సంఘం నాయకులు వాటిపై కార్మికులకు అవగాహన కల్పించాలి. – కె.కుమార్, తాపీమేస్త్రి, అల్లిపురం

మహిళా కార్మికులకు రక్షణ కల్పించాలి



భవన నిర్మాణ కార్మిక రంగంలో మహిళా కార్మికులను చాలా సమస్యలు వెన్నంటున్నాయి. పని స్థలంలో వివక్ష కొనసాగుతుంది. పనికి తగిన వేతనం లభించడం లేదు. దీనికి తోడు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందిస్తున్న సంక్షేమ పథకాలు మహిళా కార్మికులకు అందడం లేదు. వారికి రక్షణ, సంక్షేమ కల్పించాలి. – జి.లక్ష్మి, మహిళా కార్మికురాలు, అల్లిపురం

కార్మికులకు అవగాహన కల్పించాలి..



అధికారులు కార్మికులకు ఎలాంటి పథకాలు వర్తిస్తాయి అనేది అవగాహన కల్పించాలి. కార్మికులుగా పని చేసేవారు చదువుకోకపోవడంతో వారికి జరిగే నష్టం గురించి తెలియదు. కార్మిక సంఘం ఆధ్వర్యంలో అవగాహన కల్పించడంతో పాటు అధికారులతో కలిసి వారికి రావాల్సిన సంక్షేమ పథకాలు అందించే విధంగా అందరం కృషి చేయాలి. భవన నిర్మాణ కార్మికులకు సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలి. – కోట సత్తిబాబు, అధ్యక్షుడు, విశాఖ భవన నిర్మాణ కార్మిక సంఘం

ఎర్నిమాంబ అమ్మవారికి సారె సమర్పణ



భక్తులు సమర్పించిన సారెతో ఎర్నిమాంబ అమ్మవారు

కంచరపాలెం: జ్ఞానాపురంలో వెలసిన ఎర్నిమాంబ అమ్మవారి జాతర మహోత్సవాల్లో భాగంగా ఆలయ పూజారి వాసుపల్లి విజయమ్మ ఆధ్వర్యంలో శనివారం వేకువ జామున సారె ఊరేగింపు ఘనంగా నిర్వహించారు. అచ్చియ్యమ్మపేట నుంచి అధిక సంఖ్యలో విచ్చేసిన మహిళలు, భవానీలు అల్లిపురం, కొబ్బరితోట, రైల్వేస్టేషన్, కాన్వెంట్ కూడలి మీదుగా అమ్మవారి సారె ఊరేగించారు. జ్ఞానాపురం ఎర్నిమాంబ ఆలయానికి చేరుకుని పసుపు కుంకుమ, సారె, చీరను అమ్మవారికి సమర్పించారు. కార్యక్రమంలో ఆయా గ్రామ ప్రతినిధులు, ఆలయ ఉత్సవ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

'స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర'తో పరిసరాల పరిశుభ్రత



మొక్కలకు నీరుపోస్తున్న జేసీ మయూర్ అశోక్. చిత్రంలో డీఆర్‌వో భవానీశంకర్ తదితరులు



ర్యాలీ నిర్వహిస్తున్న జిల్లా పరిషత్ సిబ్బంది



కేజీహెచ్‌లో ప్రతిజ్ఞ చేయిస్తున్న ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్

మహారాణిపేట: కలెక్టరేట్ ప్రాంగణంలోని పార్కులో డీఆర్వో భవానీశంకర్‌తో కలిసి జాయింట్ కలెక్టర్ కె.మయూర్ అశోక్ మొక్కలు నాటారు. గార్డెన్‌లోని చెత్తను తొలగించారు. కలెక్టరేట్ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన వైద్య శిబిరంలో అధికారులు, సిబ్బంది ప్రాథమిక వైద్య పరీక్షలు చేయించుకున్నారు.

జిల్లా పరిషత్‌లో..

జిల్లా పరిషత్ ఆధ్వర్యంలో శనివారం స్వర్ణాంధ్ర స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా బీట్ ద హీట్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణాధికారి పి.నారాయణమూర్తి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన మజ్జిగ చలివేంద్రం స్టాల్‌ను ఆయన ప్రారంభించారు. జిల్లా పరిషత్ సిబ్బందితో కలిసి స్లోగన్లు ప్రదర్శిస్తూ ర్యాలీ నిర్వహించారు. మానవ హారంగా ఏర్పడి స్వర్ణాంధ్ర స్వచ్ఛాంధ్ర ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో పంచాయతీరాజ్ సిబ్బంది, మినిస్టీరియల్ జిల్లా అధ్యక్షుడు ఎస్.సత్తిబాబు, జిల్లా పరిషత్ పరిపాలనాధికారి (ఏవో) డి.మంజులవాణి, పలు సెక్షన్ల అధికారులు ఎం.నర్సింహమూర్తి, పీవీవీఎస్ మూర్తి, పీవీవీ సతీష్, వి.రాజేశ్వరి, ఎస్.రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

పీఆర్ఎస్ఈలో పరిసరాల శుభ్రత..

జిల్లా పరిషత్ ఆవరణలోని పంచాయతీరాజ్ ఎస్ఈ కార్యాలయంలో పరిసరాల పరిశుభ్రత కార్యక్రమం నిర్వహించారు. పలువురు ఇంజినీర్లు, సిబ్బంది పాల్గొన్నారు. మొక్కలు నాటి నీరు పోశారు. అనంతరం సిబ్బంది చేత ఎస్ఈ శ్రీనివాసరావు ప్రతిజ్ఞ చేయించారు.

కేజీహెచ్‌లో..

కేజీహెచ్ క్యాజువాలిటీ, ఇతర అభివృద్ధి పనులను ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ శనివారం ప్రారంభించారు. 40 పడకలతో ఏర్పాటు చేసిన జనరల్ మెడిసిన్ వార్డులు, కమాండ్ కంట్రోల్ సిస్టమ్‌కు అనుసంధానిస్తూ ఏర్పాటు చేసిన పబ్లిక్ అడ్రసింగ్ సిస్టమ్‌ను కూడా ఏర్పాటు చేశారు. అనంతరం మూడవ శనివారం కావడంతో స్వర్ణాంధ్ర స్వచ్ఛాంధ్ర కార్యక్రమం నిర్వహించారు. సూపరింటెండెంట్ డాక్టర్ పి.శివానంద్ ప్రసంగిస్తూ ఎండ దెబ్బ వల్ల కలిగే సమస్యలు, తీసుకోవలసిన జాగ్రత్తల గురించి తెలిపారు. ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ మాట్లాడుతూ ఎన్నడూ లేని విధంగా అత్యాధునిక సదుపాయాలు కల్పించడమే ధ్యేయంగా పని చేస్తున్నామన్నారు అనంతరం ఉద్యోగులు, ప్రజలతో కలిసి స్వచ్ఛాంధ్ర ప్రతిజ్ఞ చేయించి, అవగాహన ర్యాలీలో పాల్గొన్నారు. కేజీహెచ్ ఆవరణలో మొక్కలు నాటారు. ఈ కార్యక్రమాలలో ఆంధ్ర వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.వి.ఎస్.ఎం. సంధ్యాదేవి, డిప్యూటీ సూపరింటెండెంట్లు డాక్టర్ వాసవీలత, డాక్టర్ రవి, డిప్యూటీ సీఎస్ఆర్ఎంవో డాక్టర్ మెహర్‌కుమార్, ఆర్ఎంవోలు, నర్సింగ్ సూపరింటెండెంట్, నర్సింగ్ సిబ్బంది, మినిస్టీరియల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

డీఎంహెచ్‌వో కార్యాలయంలో..

డీఎంహెచ్‌వో కార్యాలయంలో చెత్త తొలగించి మొక్కలు నాటారు. నాటడం వంటి కార్యక్రమాలు చేపటారు. తడి చెత్తకు గ్రీన్ డస్ట్‌బిన్, పొడి చెత్తకు రెడ్ డస్ట్‌బిన్, హానికరమైన చెత్తకు బ్లూ డస్ట్‌బిన్ ఉపయోగించాలని తెలిపారు. వేడిని తరిమికొట్టండి-వడదెబ్బ నుండి కాపాడుకోండి అనే నినాదంతో ప్రజలకు అవగాహన కలగచేశారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ పి.జగదీశ్వరరావు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో జిల్లా మీడియా విస్తరణాధికారి బి.నాగేశ్వరరావు, పలు విభాగాల అధికారులు పాల్గొన్నారు.

జనావాసాల్లో సెల్ టవర్ వద్దంటూ వినతి



ఎమ్మెల్యే వంశీకి వినతిపత్రం అందజేస్తున్న సీపీఎం నాయకులు, స్థానికులు

డాబాగార్డెన్స్: జనావాసాల్లో సెల్ టవర్ ఏర్పాటు చేయొద్దంటూ 38వ వార్డు చెంగల్రావుపేటకు చెందిన పలువురు స్థానికులు ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్‌కు శనివారం వినతిపత్రం అందజేశారు. వార్డు పరిధి చెంగల్రావుపేట పంజా జంక్షన్‌లో సెల్ టవర్ ఏర్పాటుకు వ్యతిరేకంగా స్థానికులు పెద్ద ఎత్తున ఆందోళన చేపట్టారు. ఆ సమయంలోనే స్థానిక ఎమ్మెల్యే వార్డులో పర్యటిస్తుండగా ఆందోళనకారులు సమస్యను ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. సెల్ టవర్ ఏర్పాటు చేస్తున్న ఇంటికి ఎమ్మెల్యే వెళ్లి మాట్లాడారు. సెల్ టవర్ ఏర్పాటు వల్ల అనేక ఇబ్బందులు ఎదుర్కోవలసి వస్తుందని, అధిక రేడియేషన్ వల్ల పలు జబ్బులు వచ్చే ప్రమాదం ఉందని, 8 ఏళ్ల కిందట ఇదే ప్రాంతంలో సెల్ టవర్ ఏర్పాటు చేస్తుంటే స్థానికులంతా పెద్ద ఎత్తున ఆందోళన చేపట్టినట్లు ఎమ్మెల్యేకి తెలిపారు. మరలా ఇదే ప్రాంతంలో మరో సెల్ టవర్ ఏర్పాటుకు జీవీఎంసీ అధికారులు ఎలా అనుమతులు ఇచ్చారని ప్రశ్నించారు. కార్యక్రమంలో సీపీఎం నాయకుడు వై. రాజు, ఎం. సుబ్బారావు, కె. చంద్రశేఖర్, సంతోష, పైడిశెట్టి, శ్రీను, ప్రసాద్, స్థానికులు తదితరులు పాల్గొన్నారు.

ఈస్ట్ కోస్ట్ రైల్వే ఏజీఎం తనిఖీలు



అరణ్యలో సదుపాయాలను పరిశీలిస్తున్న ఏజీఎం మోహెస్‌కుమార్ బెహరా

తాటిచెట్లపాలెం: ఈస్ట్ కోస్ట్ రైల్వే అడిషనల్ జనరల్ మేనేజర్ మోహెస్ కుమార్ బెహరా శనివారం వాల్తేర్ డివిజన్‌లో పర్యటించి తనిఖీలు చేపట్టారు. విశాఖపట్నం పోర్ట్ ఏరియా, అదాని గంగవరం పోర్ట్ ప్రాంతాల్లో పర్యటించి అక్కడ జరుగుతున్న పలు అభివృద్ధి పనులను, సైడింగ్, లోడింగ్ పాయింట్స్, ఇతర సదుపాయాలను, పలు కీలక ప్రాంతాలను పరిశీలించారు. అనంతరం విశాఖ పోర్ట్ అథారిటీ ఉన్నతాధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ప్రస్తుతం నెలకొన్న పరిస్థితులు, పరిశీలించి, రేక్‌ల సామర్థ్యాన్ని పెంచి కార్గో రవాణాకు మరింత ప్రోత్సాహమివ్వాలని ఆయన కోరారు. రైల్వే నుంచి అవసరమైన పూర్తి సహాయ సహకారాలను అందజేస్తామన్నారు. అనంతరం వాల్తేర్ డివిజన్ భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ కార్యక్రమాల వేదిక అరణ్యను పరిశీలించారు. ఈ ప్రదేశంలో క్లైంబింగ్ వాల్, టైర్ వాల్, టైర్ టవర్, రోప్ క్లైంబర్, హర్డిల్‌పాసర్, టైర్ క్రాసింగ్, మంకీ బ్రిడ్జి, కమాండో బ్రిడ్జి, టైర్ టన్నెల్, మౌగ్లీ జంపింగ్, ఫుట్ వాకర్ వంటి సౌకర్యాలను పరిశీలించారు. వీటిని స్కౌట్స్ అండ్ గైడ్స్ సమర్థవంతంగా వినియోగించుకోవాలని సూచించారు. డీఆర్ఎం లలిత్ బోరా, ఏడీఆర్ఎంలు మనోజ్‌కుమార్ సాహూ(ఆపరేషన్స్), సీనియర్ డివిజనల్ ఇంజినీర్ (కో ఆర్డినేషన్) ఏకే మహారాణా, పోర్ట్ సీఈవో అమిత్‌మాలిక్, ఇతర సీనియర్ అధికారులు, వాల్తేర్ డివిజన్ సీనియర్ అధికారులు, ఈస్ట్ కోస్ట్ రైల్వే ప్రధాన కార్యాలయ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

ఘనంగా ఎర్నిమాంబ తొలేళ్ల సంబరం



ఎర్నిమాంబ అమ్మవారి ఘటాలతో వస్తున్న భక్తులు, కమిటీ ప్రతినిధులు



ఉత్సవ విగ్రహంతో ఆలయ సిబ్బంది

కంచరపాలెం: కాన్వెంట్ కూడలిలో గల ఎర్నిమాంబ అమ్మవారి తొలేళ్ల సంబరాన్ని ఈవో డీవీఎస్ సురేష్‌బాబా నేతృత్వంలో శనివారం ఘనంగా నిర్వహించారు. సాయంత్రం పూర్ణామార్కెట్ దుర్గాలమ్మ ఆలయం వద్ద సుమారు 260 ఎర్నిమాంబ అమ్మవారి ఘటాలతో భక్తులు కాలినడన బయలుదేరారు. కొబ్బరితోట, అల్లిపురం, అచ్చియ్యమ్మపేట, రైల్వేస్టేషన్, కాన్వెంట్ కూడలి మీదుగా జ్ఞానాపురంలోని పుట్టబంగారం వద్దకు అమ్మవారి ఘటాలను చేర్చారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన నేలవేషాలు, సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఎమ్మెల్యే వంశీ కృష్ణ శ్రీనివాస్, కార్పొరేటర్ కోడిగుడ్ల పూర్ణిమ శ్రీధర్ తొలేళ్ల సంబరాన్ని ప్రారంభించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయం వద్ద ఏర్పాటు చేసిన అగ్నిగుండంపై మాలధారులు నడిచి మొక్కులు చెల్లించుకున్నారు. హార్బర్, కంచరపాలెం ట్రాఫిక్ పోలీసులు బందోబస్తు నిర్వహించారు. ఆదివారం ప్రధాన జాతర నిర్వహించనున్నట్లు ఈవో సురేష్‌బాబా తెలిపారు.

భెల్‌లో ఆక్టోపస్ మాక్ డ్రిల్



ఆక్టోపస్ సిబ్బంది నుంచి వివరాలు తెలుసుకుంటున్న సౌత్ ఏసీపీ త్రినాథ్

అక్కిరెడ్డిపాలెం: భెల్ (హెచ్‌పీవీపీ)లో ఆక్టోపస్ సిబ్బంది శనివారం రాత్రి మాక్ డ్రిల్ నిర్వహించారు. ఉగ్రవాద కార్యకలాపాలు, దుష్ట శక్తుల నుంచి భారీ సంస్థలను ఎలా కాపాడుకోవాలో విన్యాసాల ద్వారా అవగాహన కల్పించారు. దీని ద్వారా ప్రభుత్వ రంగ సంస్థలు రక్షణ వలయంలో ఉన్నాయన్న సంకేతాలు ప్రజల్లోకి తీసుకువెళ్లడమే లక్ష్యమన్నారు. ఆక్టోపస్ అధికారి రాజారెడ్డి ఆధ్వర్యంలో విన్యాసాలు అర్ధరాత్రి వరకు కొనసాగాయి. సౌత్ ఏసీపీ టి.త్రినాథ్, గాజువాక సీఐ పార్థసారథి సంస్థకు చేరుకుని ఆక్టోపస్ సిబ్బందిని కలిసి వివిధ అంశాలపై చర్చించారు.

పూల్ కలాసీల సమస్య పరిష్కారానికి కృషి



ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజుకు వినతిపత్రం అందజేస్తున్న పూల్ కలాసీలు

డాబాగార్డెన్స్: పోర్టు పూల్ కలాసీల సమస్య కేంద్ర షిప్పింగ్ మంత్రితో మాట్లాడి పరిష్కరిస్తానని ఉత్తర నియోజకవర్గ ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజు హామీ ఇచ్చారు. పూల్ కలాసీలకు ఉద్యోగ భద్రత కల్పించాలని కోరుతూ శనివారం వారంతా ఎమ్మెల్యేని కలిసి వినతిపత్రం అందజేశారు. ఆయన స్పందిస్తూ కేంద్ర షిప్పింగ్ మినిస్టర్‌కు, విశాఖ పోర్టు ట్రస్ట్ చైర్మన్‌కు లేఖలు పంపినట్టు చెప్పారు. గత 30 ఏళ్లుగా పోర్టులో వివిధ విభాగాల్లో పని చేస్తూ చాలీచాలని జీతాలతో కొట్టుమిట్టాడుతున్నామని కలాసీలు తెలిపారు. పోర్టు యాజమాన్యానికి పలు మార్లు విజ్ఞప్తి చేసినా నిమ్మకు నీరెత్తినట్టు వ్యవహరిస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. పూల్ కలాసీల పేరిట కంప్యూటర్ ఆపరేటర్‌గా, సెక్యూరిటీ గార్డుగా, క్లర్క్‌గా, ఎలక్ట్రీషియన్లుగా వివిధ రకాలుగా వివిధ విభాగాల్లో పని చేస్తున్నప్పటికీ సమాన పనికి సమాన వేతనం లేకుండా కేవలం పూల్ కలాసీలగానే జీవితాలు ముగిసిపోతున్నాయని మొరపెట్టుకున్నారు. పలువుర్ని పర్మినెంట్ చేసి, మరి కొందర్ని పర్మినెంట్ చేయకుండా వదిలేయడం ఎంత వరకు సబబన్నారు. ఎమ్మెల్యేని కలిసిన వారిలో సమయం హేమంత్‌కుమార్, వాసుపల్లి రాము, ఖలీసా, ఎర్రబాబు, రమేష్, ఈశ్వరరావు తదితరులు ఉన్నారు.

విద్య, వైద్యంలో దక్షిణాది ముందంజ



సావనీర్ ఆవిష్కరిస్తున్న డాక్టర్ సునీతా తాండల్వాడ్కర్ తదితరులు

మహారాణిపేట: గైనకాలజీలో పలు ఆధునాత వైద్య ప్రక్రియలు వస్తున్నాయని, వీటిపై పురోగతి సాధించవలసిన అవసరం ఉందని ఫెడరేషన్ ఆఫ్ ఆబ్స్టెట్రిక్స్ అండ్ గైనకాలజికల్ సొసైటీ ఆఫ్ ఇండియా అధ్యక్షురాలు డాక్టర్ సునీతా తాండల్వాడ్కర్ అన్నారు. విశాఖలోని ప్రసూతి, గైనకాలజికల్ సొసైటీ మొదటిసారిగా రెండు రోజుల పాటు ప్రెసిడెన్షియల్ కాన్ఫరెన్స్ ఫెడరేషన్ ఆఫ్ ఆబ్స్టెట్రిక్స్ అండ్ గైనకాలజికల్ సొసైటీ ఆఫ్ ఇండియా (ఫోగ్సీ) వేవ్స్-2025ను నిర్వహిస్తోంది. అందులో భాగంగా తొలి రోజు సదస్సును ఆమె జ్యోతి వెలిగించి ప్రారంభించారు. దక్షిణ భారతదేశం వైద్యపరంగా, విద్యాపరంగా బలంగా ఉందన్నారు. ఇక్కడి నుంచి ప్రసూతి, ఇతర స్త్రీ వ్యాధులపై సీఎంఈ కార్యక్రమాలు జరుగుతున్నాయన్నారు. ప్రసూతి, గైనకాలజీ సొసైటీ వచ్చే ఏడాది వజ్రోత్సవాలు జరుపుకుంటుందని ఆర్గనైజింగ్ చైర్‌పర్సన్ డాక్టర్ సుబ్బరాజు అన్నారు. మాజీ డీఎంఈ డాక్టర్ ఆర్.శశిప్రభ మాట్లాడుతూ ప్రసూతి రంగంలో వస్తున్న మార్పులపై చర్చ జరగాలన్నారు. దేశంలోని వివిధ ప్రాంతాల నుండి దాదాపు 1000 మంది గైనకాలజిస్టులు పాల్గొన్నారు.

బీచ్‌రోడ్డులో పీఎం సూర్యఘర్ అవగాహన ర్యాలీ



బీచ్‌రోడ్డులో ర్యాలీ నిర్వహిస్తున్న విద్యుత్ సిబ్బంది

మహారాణిపేట: ఆంధ్రప్రదేశ్ తూర్పు విద్యుత్ పంపిణీ సంస్థ (ఏపీఈపీడీసీఎల్)విశాఖపట్నం సర్కిల్ ఎస్ఈ జి. శ్యాంబాబు ఆధ్వర్యంలో నగరంలో ర్యాలీ నిర్వహించారు. పీఎం సూర్యఘర్ అవగాహన ర్యాలీలో సిబ్బంది పాల్గొన్నారు. శనివారం సాయంత్రం ఆర్కే బీచ్ కాళీమాత గుడి నుంచి వైఎంసీఏ వరకు నిర్వహించిన అవగాహన ర్యాలీలో జోన్-1 ఈఈ బి. సింహాచలంనాయుడు, టెక్నికల్ ఈఈ ఎం. ధర్మరాజు, సిబ్బంది,ఇంజినీర్లు తదితరులు పాల్గొన్నారు.

మనమంతా వైఎస్సార్‌సీపీ కుటుంబం



దంపతులను అభినందిస్తున్న వాసుపల్లి గణేష్‌కుమార్

మహారాణిపేట: జగన్‌మోహన్‌రెడ్డి గెలుపే లక్ష్యంగా పనిచేసే మనమంతా వైఎస్సార్‌సీపీ కుటుంబమని మాజీ ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ అన్నారు. శనివారం సాయంత్రం 27వ వార్డు పార్టీ యూత్ ప్రెసిడెంట్ పిల్లి అజయ్ రెడ్డి, పిల్లి రజిని రెడ్డి దంపతుల వివాహ వార్షికోత్సవంలో పాల్గొని శుభాకాంక్షలు తెలిపారు. తిరుమల తిరుపతి శ్రీవారి చిత్రపటాన్ని బహూకరించి దంపతులకు దీవెనలు అందజేశారు. పార్టీ ప్రతిష్టకు నిరంతరం సేవలందించడంతో పాటు, పార్టీ బలోపేతానికి తనతో నమ్మకంగా నడిచే శ్రేణులకు వాసుపల్లి తోడుగా నిలుస్తున్నారు. ఈ కార్యక్రమంలో 27వ వార్డు ప్రెసిడెంట్ నీలాపు సర్వేశ్వరరెడ్డి, జీరు గురుమూర్తి, అప్పలరాజు, గంగాధర్, మౌలేష్, పాలికల వీర్రాజు, లక్ష్మి, కుమారి, పద్మనాభం రాజా తదితరులు పాల్గొన్నారు.